RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 273

బుధవారం
అక్టోబర్ 01, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



తెలంగాణ సంస్కృతికి ఆనవాలు బతకమ్మ

3లో..




# ఉమెన్ సేఫ్టీకి ప్రయారిటీ

- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం
- హైదరాబాద్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్
- ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్స్‌కు ప్రమోషన్ చేయద్దు
- మద్యం తాగి రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు తప్పవు
- సీపీ సజ్జనార్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు అరికట్టడంతో పాటు మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని హైదరాబాద్ నూతన కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే నంబర్‌వన్ నగరంగా ఉంచడంలో తనవంతు బాధ్యత నిర్వహిస్తానని అన్నారు. హైదరాబాద్ నూతన కమిషనర్‌గా వీసీ సజ్జనార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో అనేక మంది గొప్పవాళ్లు సీపీలుగా పని చేశారని, ప్రజలకు సేవ చేసేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బాధ్యత కలిగిన ప్రతి పౌరుడూ పోలీసుగా పని చేయాలని, సైబరాబాద్‌లో పనిచేసినప్పుడు ప్రజలు ఎంతో సహకరించారని గుర్తు చేశారు. పీపుల్స్ ఫ్రెండ్లీ అని హైదరాబాద్ పోలీసులకు మంచి పేరుందని, నగరం లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**- ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్స్‌కు ప్రమోషన్ చేయద్దు**

హైదరాబాద్‌లో నేరాల కట్టడికి అనేక చర్యలు చేపడతామని, ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత బాగా చెడిపోతున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్స్‌కు ప్రమోషన్ చేయవద్దని వీఐపీలను కోరారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని, అరుదైన వ్యాధులకు ఔషధాల పేరుతో మోసాలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. ఆన్‌లైన్ మోసాలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. జీఎస్టీ తగ్గించాక వాహనాల కొనుగోళ్లు బాగా పెరిగిందని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ట్రాఫిక్ వల్ల సమయం వృథా మాత్రమే కాదని, ఆరోగ్యం పాడవుతుందని అన్నారు. మద్యం తాగి రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తాగి వాహనాలు నడిపిన వారిని వదిలేదు లేదని, వాళ్లను రోడ్ టెర్రరిస్టులుగా భావిస్తామని అన్నారు.



**- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం**

దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్ అని, ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రగ్స్ అని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టామని, సైబర్ నేరాలపై నగర ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ఆధారాలు చూపని నగదు జప్తు



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీస్ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి హనుమాన్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బులు, మద్యం రవాణా చేస్తే సీజ్ చేస్తామని ఎస్ఐ అనిల్ కుమార్ సూచించారు. ఒక వ్యక్తి వద్ద 50 వేల నగదుకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు రవాణాపై నిబంధనలు పాటించాలని ప్రజలకు ఎస్ఐ అనిల్ కుమార్ సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



- పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి
- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండి.. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకై కృషి చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ బారాస పార్టీ కార్యాలయములో వేములపల్లి మండల పార్టీ ఆధ్వర్యములో బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశము నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, తెలంగాణ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి పాల్గొని వేములపల్లి మండల,గ్రామ కమిటి కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు మాట్లాడుతూ పార్టీ తరపున ఎవరినీ అభ్యర్థిగా నియమించిన అందరూ

మిగతా 3వ పేజీలో..

## స్థానిక ఎన్నికల రిజర్వేషన్లన్నీ తప్పుల తడక



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మేడ్చల్ మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మంగళవారం రోజున ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అది తప్పకుండా అమలు చేయాలని దానికి శాసనసభలో, శాసనమండలిలో భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అలా కాకుండా ప్రజలను మభ్య పెట్టడానికి ఎన్నికలలో ఓట్లు దండుకోవడానికి రిజర్వేషన్లు వాడుకోవడం కాకుండా నిజాయితీగా అమలు జరిపించాలని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కు సంబంధించి నాయకులు ఎవరు మాట్లాడిన వారిపై బురద జల్లడం మాటలతో దాడి చేయడం కాకుండా ఇచ్చిన మాట ప్రకారం బీసీ బిడ్డలకు రిజర్వేషన్ అమలు చేసి న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రజలకు అసలు వాస్తవాలు తెలియజేసి ప్రభుత్వ కపట బుద్ధిని బయటపెడతామని హెచ్చరించారు. ఇటీవల విడుదల చేసిన రిజర్వేషన్లలో మొత్తం తప్పుల తడకగా ఉందని, టెక్నాలజీ ఎక్కువగా వినియోగం లేని రోజుల్లోనే రిజర్వేషన్ జనాభా ప్రకారం సరైన విధంగా అమలు జరిగిందని, టెక్నాలజీ ఇంత వినియోగంలోకి వచ్చి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా జనాభా ప్రకారం రిజర్వేషన్ ప్రకారం ఎవరికి రావాల్సిన రిజర్వేషన్ వారికి సరైన విధంగా రాకపోవడం ఈ ప్రభుత్వం యొక్క అవగాహన రాహిత్యానికి కారణమని, ఏది ఏ విధంగా చేయాలో తెలియకపోవడానికి కారణం ఆ నాయకునికి అనుభవ లేమి కూడా ఒక కారణమని ఆరోపించారు. రిజర్వేషన్లకు సంబంధించి ఎవరికి అన్యాయం జరిగినా భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు.



## నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత హాజరై మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్, ఎస్ఎస్టీ లు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలిం చడంపై వివరించారు. ఆయా మండలాల నోడల్ ఆఫీసర్లు తమ నివేదికను ప్రతి రోజు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియమించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షర్ఫుద్దీన్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టులో చెల్లదని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారు



వేద న్యూస్ డెస్క్ : కోర్టులో చెల్లవని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి గందరగోళానికి గురి చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విమర్శించారు. ఎవరిని మోసం చేయడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ఆయన ప్రశ్నించారు. హన్మకొండ జిల్లా కమలాపూర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ,

మిగతా 4వ పేజీలో..

## తెలంగాణలో మళ్లీ రెండురోజులు భారీ వర్షాలు



- హెచ్చరించిన వాతావరణశాఖ..!

వేద న్యూస్ డెస్క్ : తెలంగాణలో మరికొద్దిరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్



## గ్రామానికి సేవ చేసేందుకే ముందుకు వస్తున్నా

**వేద న్యూస్, శాయంపేట:**



నాయకత్వం కోసం కాదు. గ్రామానికి సేవ చేసేందుకు ముందుకు వస్తున్నాననీ సూర్యనాయక్ తండా గ్రామానికి చెందిన యువ సర్పంచ్ అభ్యర్థి జరుపుల గీత అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రామ పంచాయతీల రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా మండలంలోని సూర్య నాయక్ తండ సర్పంచ్ ఎస్టీ మహిళ రావడం జరిగింది.కన్నతల్లి లాంటి ఊరు కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ బరిలో నిలిచి, గెలిచిన తర్వాత సామాన్య ప్రజలకు సేవ చేసేందుకు యువ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉంటానని రాజకీయాల్లో నా వంతు పాత్ర పోషిం చేందుకు సిద్ధంగా ఉన్నానని సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధిలో పాలుపంచుకొని కన్నతల్లి లాంటి ఊరుకి నా వంతు కృషిగా పని చేసి ఆచరణలో చూపెడతాననీ గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతోనే సర్పంచ్ బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.ప్రజలు ఆశీర్వదిస్తే తప్పకుండా సర్పంచ్ గా పోటీ చేసి విజయం సాధించి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటానని అన్నారు.

## ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో ధర్నా

**వేద న్యూస్,మెట్ పల్లి:**




కోరుట్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని అపరిష్కృతమైన సమస్యలు పరిష్కరించాలని అఖిల రాజకీయ ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం రోజున అఖిల పార్టీ రాజకీయ ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో కోరుట్ల రైల్వేటేషన్ నందు అనేక సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టి అనంతరం ప్రభుత్వాన్ని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. నేతలు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ లో అసౌకర్యంగా ఉన్న స్థితిగతులను అభివృద్ధికి నోచుకోని సమస్యలను రైల్వే అధికారులు. ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని కోరారు 9 సంవత్సరాల క్రితం వెలిసిన ఈ రైల్వే స్టేషన్ కు వాటి నుండి ఉన్న కల్లూరు రోడ్డు నుండి రైల్వే స్టేషన్ కు వెళ్లే రహదారి మూసి వేయడంతో ప్రయాణికులకు వాహనదారులకు పిల్లలకు వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వెంటనే కల్లూరు నుండి ఐలాపూర్ వెళ్లే రోడ్డు వరకు రైల్వే స్టేషన్ ముందు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి రహదారిని కొనసాగించాలని అధికారులను కోరారు.రైల్వే టేషన్ ముందుభాగం నిలువ ఉన్న అనేక కంకర కుప్పలను స్టేషన్ వెనుక భాగమునకు మార్చివేసి బల్లాస్ట లోడింగ్ ట్రాక్ పనులను వెనుక భాగం వైపే చేపట్టాలన్నారు.అలాగే ఈ మధ్యకాలంలో బొంబాయి హైదరాబాద్ తిరుపతి వరంగల్ విజయవాడ తదితర నగరాలకు వెళ్లే రైళ్లను కోరుట్ల రైల్వే స్టేషన్లో స్టాప్ కల్పించి ఆపాలన్నారు. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవిందు కోరుట్ల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కె సంజయ్ కుమార్, లు వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే దక్షిణ మధ్య రైల్వే మరియు భారతీయ రైల్వే శాఖ అధికారులకు స్పీడ్ పోస్ట్ ద్వారా వినతి పత్రం అందించారు.స్థానిక స్టేషన్ మాస్టర్ కు అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఇబ్బంది. కలగకుండా కోరుట్ల ప్రజల పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నేతలు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎండి ముక్రం, చింతా భూమేశ్వర్, కొంచెం శంకర్,టిఆర్ఎస్ నేతలు సయ్యద్ అన్వర్,ఎండి రహీం పాషా, భూ పెల్లి నాగేష్, బిజెపి నేత బింగి వెంకటేష్,టిడిపి నేత గజ్జలి రాజ గణేష్, సమాజ్వాద్ పార్టీ నేత ముజాహిద్, ఎంఐఎం నేత అబ్దుల్ రఫిక్, మైముద్ అలీ,చెన్న రాజశేఖర్, అందే వంశీకృష్ణ,పులగం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## బహుమతులు అందజేత

**వేద న్యూస్, చొప్పదండి:**

పట్టణంలోని పదమూడో వార్డు పరిదిలోని మూడు చోట్లలో చొప్పదండి బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు శ్రీమాన్ తులసి ప్రభాకరచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పదిహేను మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. బతుకమ్మ సంబరాల్లో బహుమతులు గెలిచిన వారు ఆనందం వ్యక్తం చేశారు. మరిమడ్ల వాడ జ్యోతినగర్ లో ప్రథమ బహుమతి అర్థవేల్లి జ్యోత్స్న శ్రీనివాస్, ద్వితీయ మరిమడ్ల లక్ష్మి పోశమల్లు, మూడవ మరిమడ్ల పద్మ మెహన్ గెలుపోందారు. కుర్మవాడలో పెద్ది రమాలత బీరయ్య, రెండవ బహుమతి చుక్కా మౌనిక, మూడవ అమరగోండ సంధ్య గెలుపోందారు. పంతులు గ్రౌండ్ దుర్గా భవాని మంటపం ముందు ప్రథమ దండే లత సురేష్, ద్వితీయ మంద విజయ అంజయ్య, తృతియ బహుమతి తిరునహరి సావిత్రి సత్యనారాయణ లు లక్కిడ్రాలో గెలుపోందారు. మూడుచోట్ల పదిహేను మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. పదేళ్ల ఇద్దరూ అమ్మాయిలు, ఇద్దరూ అబ్బా యిలకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ బహుమ తులను ఏస్వీజేసీ డైరెక్టర్ సిం హాచలం హరికృష్ణ, మంద అంజయ్య, సింహాచలం ప్రభాకర్ చార్యులు, పెద్ది రాములు, పెద్ది శ్రీనివాస్, మరిమడ్ల రాజిరెడ్డి, చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రానున్న రోజు ల్లో ఇంకా ఆకర్షణీయమైన బహుమతులు అందజెస్తామని ప్రభాకర చార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాత యూత్ క్లబ్ సభ్యులు, యంగ్ బాయ్స్ యూత్ క్లబ్ సభ్యులు వార్డు లోని ప్రముఖులు ఆడపడుచులు పాల్గొన్నారు.



## ఏలుపుగొండలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**వేద న్యూస్, టేక్మల్ :**

మెదక్ జిల్లా టేక్మల్ మండలం ఏలుపుగొండ లో సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ రాష్ట్రానికి సొంతమైన రంగురంగుల పండుగ బతుకమ్మ మన ఉనికికి మూలం ప్రకృతి, సకల చరాచర సాధనకు జన్మనిచ్చింది ప్రకృతి. ఆ ప్రకృతి సంపూర్ణ ఆరాధనే బతుకమ్మ పండుగ వేడుక. ఈ పండుగ ఒక ఉత్సాహం ఉల్లాసమే కాదు సంఘజీవన తత్వికతకు నిదర్శనం, స్నేహ మాధుర్యాలకు ప్రతీక పుడమి తల్లి గొప్పతనాన్ని తెలిపే పండుగ ప్రకృతిని ఆరాధించేందుకు ఈ పండుగ వేదికగా నిలుస్తుంది. అన్నింటికంటే ప్రత్యేకమైనది ఈ పండుగలో స్త్రీలందరూ కలసి పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడుతూ ఆనందోత్సాహాలతో గడుపుతారు. 9 రోజులపాటు జరుపుకునే ఈ సంబరాలలో మహిళల ఆనందం అంబరాన్ని తాకుతుంది. రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించి సంతోషంగా జరుపుకుంటారు. టేక్మాల్ మండల్ ఎలుపుగొండ గ్రామంలో బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. స్త్రీలు ఎలాంటి అర మరికలు ఆర్థిక కులాంతరాల తేడాల్లేకుండా కలసి నిర్వహించుకున్నారు.

## పులి సాయితేజ ముదిరాజ్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

**వేద న్యూస్, హన్మకొండ :**



ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1,2 ఫలితాల్లో హనుమకొండ పట్టణం, నయీంనగర్ కు చెందిన పులి కిషన్-జ్యోతి ముదిరాజ్ ల కుమారుడు పులి సాయితేజ ముదిరాజ్ గ్రూప్ 1 లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంక్ సాధించి డీఎస్పీ గా ఎన్నికయ్యారు.విషయం తెలుసుకున్న మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు వారి నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు.అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ డీఎస్పీ పులి సాయితేజ ముదిరాజ్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సెలెక్ట్ అయిన గ్రూప్ వన్ టు విజేతలను ఆదర్శంగా తీసుకొని ముదిరాజ్ యువత విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. గ్రూప్ వన్ లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు సాధించి డిఎస్పి ఉద్యోగానికి ఎంపికైన పులి సాయి తేజ ముదిరాజ్ ని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించడం జరిగింది.హనుమకొండ జిల్లా మెపా అధ్యక్షుడు పులి రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పులి దేవేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డారు.ఉద్యోగాలు పొందిన వారిని యువత ముదిరాజ్ విద్యార్థులు ఆదర్శం గా తీసుకొని ముందుకెళ్లాలని దేవేందర్ ఈ సందర్భంగా పిలుపుని చ్చారు. ఇప్పటికే సి ఆర్ పి ఎఫ్ లో డీఎస్పీ హెూదాలో పనిచేస్తూనే గ్రూప్ వన్ ఉద్యోగానికి ఎంపికైన సాయి తేజ కృషి పట్టుదల అద్భుతమని కొనియాడారు. అనంతరం డీఎస్పీ పులి సాయి తేజ ముదిరాజ్ మాట్లాడుతూ నేను ఏ స్థాయిలో ఉన్న వెనుకబడిన ముదిరాజ్ బిడ్డల కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు.తనను సన్మానించిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.నేను ఈ స్థాయికి రావడానికి కృషి చేసిన నా తల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, రాష్ట్ర సలహాదారు పులి ప్రభాకర్ ముదిరాజ్, సాయి తేజ తల్లిదండ్రులు పులి జ్యోతి కిషన్, సాయి తేజ అక్క బావ దివ్య రమేష్, హనుమకొండ జిల్లా కార్యదర్శి పల్లెబోయిన సూర్యప్రకాష్,కుటుంబ సభ్యులు పులి సుధాకర్, శ్యామ్,ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రాలను సందర్శించే అవకాశం జర్నలిస్టులకు కల్పించాలి



**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

అహర్నిశలు వార్తల కవరేజీతో మానసికంగా ఒత్తిడికి లోనవుతున్న జర్నలిస్టులకు మానసిక ప్రశాంతత కలిగేలా ఆహ్లాదకరమైన వాతావరణాలను అదేవిధంగా చారిత్రక పర్యాటక ప్రాంతాలను సందర్శించి అక్కడి విషయాలను తెలుసుకునే విధంగా అవకాశం కల్పించాలని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరు యాదగిరి మాట్లాడుతూ రోజువారీగా జర్నలిస్టులు వార్తల సేకరణలో ఎంతో ఒత్తిడికి లోనవుతున్న విషయాన్ని టూరిజం శాఖ చైర్మన్ కు తెలియజేసినట్లు తెలిపారు.జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలకు సంబంధించిన చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కొరివి సతీష్ యాదవ్,రాష్ట్ర నాయకులు వెంకటాచారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దుస్సా చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని జగన్నాథపూర్, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని దుర్గామాత అమ్మవార్లను దర్శించుకొని మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, పొన్నం అనూప్ గౌడ్ మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనతోపాటు ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్, సుకినే సంతాజి, డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు, సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్, ముప్పు, మహేందర్, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ, మండ సుమన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, అంబాల శ్రీకాంత్, శనిగరం వెంకటేష్, జీల్గుల మాజీ సర్పంచ్, రావుల రమేష్, రాంభూపాల్ రెడ్డి, రఘురాం గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు, ముప్పు శ్రీనివాస్, కట్కూరి,గౌతమ్, శీలం అనిల్ కుమార్, గోడిశాల వినయ్, గోడిశాల నరేష్, మార్కెట్ డైరెక్టర్లు, గోడిశాల రాజయ్య, దాట్ల,ప్రవీణ్, బండి సుధాకర్, నాయకులు, మొలుగు భాస్కర్, కొమురయ్య, అభిలాష్, కార్తీక్, మణికిరణ్, అంబాల జగన్, పూర్ణ చందర్, యువరాజ్, చదిరం రాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని దుర్గామాత అమ్మవారిని వేడుకున్నట్టు నాయక్ నాయకుడు అనూప్ వెల్లడించారు.

# మాజీ ఎమ్మెల్యే సతీష్ కు జన్మదిన శుభాకాంక్షలు



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

హుస్నాబాద్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు ఆయన జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి మంగళవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తెలంగాణ రైతు రక్షణ సమితి హన్మకొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ .. సతీష్ కుమార్ ను కలిసి ఆయనకు పూల బొకే అందించి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నిధులు కేటాయించాలని వినతి



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఎడపల్లి పర్శరామ్, ఆధ్వర్యంలో మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బోయినిపల్లి మండలంలోని పలు అభివృద్ధి పనులకు నిధుల కోసం అడుగగా, తను సానుకూలంగా స్పందించడం జరిగినది.అదేవిధంగా బోయినిపల్లి మండల కేంద్రంలోని జెడ్. పి. హెచ్.ఎస్, హైస్కూల్, కొదురుపాక, విలాసాగర్, గ్రామం లోని హైస్కూల్ లోని ప్రహరీ గోడలు ,అదనపు తరగతుల గదుల నిర్మాణం కొరకై నిధులు అడగగా సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, గుడి రవీందర్ రెడ్డి, క్యాతం తిరుపతి రెడ్డి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొండం శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్, బోగోజి గంగాధర్ చారి, మిరియాల శరత్ చంద్రారెడ్డి, సారంపల్లి రాజు, అమిరిశెట్టి గంగయ్య, జనగాం లక్ష్మణ్,కిరణ్ ,వేణు,వినయ్ ,మినుకుల శ్రీనివాస్ , ముసుకు విజయేందర్ రెడ్డి, నడిగొట్టు శ్రీనివాస్, గడ్డమీది నరేష్ , రమేష్, ధర్మేంద్ర, అజయ్, నవీన్ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

**వేదన్యూస్, గంగాధర:**



ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఇటీవల స్వదేశానికి తిరిగొచ్చిన చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను తడగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపిటిసి ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గుడి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎండి హుస్సేన్, ఆటో యూనియన్ అధ్యక్షులు కొండ శంకర్, కాడే భాస్కర్, వెంకటరమణ, రాజేష్, రఫీ, చంద్రారెడ్డి, చేపూరి లక్ష్మణ, శంకర్, భూమేష్, ఎర్ర రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# వర్షకొండలో పంచలోహ విగ్రహాల వితరణ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో పంచలోహ విగ్రహాలను ఎన్ఆర్ఐ మహిపాల్ వితరణ చేసారు. సుమారు రెండు లక్షల యాభై వేల విలువ గల పంచలోహాలతో తయారు చేసిన హంస వాహనము, హనుమాన్ వాహనము, సింహ వాహనము, గోమాత వాహనము, గజ వాహనములను శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి ఎన్ఆర్ఐ మంగిళపెల్లి మహిపాల్-భారతి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మహిపాల్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

సమిష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల నుంచి గ్రామా , మండల స్థాయిలో ఎటువంటి గ్రూపు, వర్గాలు లేకుండా పనిచేసి అత్యదిక సంఖ్యలో మన పార్టీ అభ్యర్థులు విజేతలు అవ్వడానికి కష్టపడాలన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు తిరగపడుతున్నారు. కనుక వాళ్ళు గ్రామాలలో కనపడితే నిలదీసే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వానికి తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.అనంతరం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేసిన సంగతి తెలిసిందే అన్నారు. కార్డును గ్రామములో ప్రతి ఒక్కరికి అందించాలని కోరారు.ఈ కార్యక్రమములో వేములపల్లి మండల పార్టీ అధ్యక్షులు,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి,చిర్ర మల్లయ్య యాదవ్,కట్టా మల్లేష్ గౌడ్, పేరాల కృపాకర్ రావు, మజ్జిగపు సుధాకర్ రెడ్డి, నంద్యాల శ్రీరాం రెడ్డి,అమిరేడ్డి శేఖర్ రెడ్డి, మేక రవి, పేరాల గుర్వ రావు, దేవారాజ్, రేగురిరాము, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్ పై ఘనంగా సద్దుల బతుకమ్మ

**వేద న్యూస్, హైదరాబాద్:**



తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ కార్నివాల్ ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్,జూపల్లి కృష్ణారావు ,కొండా సురేఖ ,పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత,కార్పొరేషన్ చైర్మన్ లు నిర్మలా జగ్గారెడ్డి , వెన్నెల గద్దర్ ,కాల్వ సుజాత ,మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద ,సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలెక్య పంజాల , టూరిజం ఎండీ క్రాంతి , కలెక్టర్ దాసరి హరిచందన హాజరయ్యారు. ట్యాంక్ బండ్ వద్ద వేలాది మంది ఒగ్గు కళాకారులు , డోలు చప్పుళ్ళ తో సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మహిళలు చక్కగా కోలాటాలతో ఆటపాటలతో బతుకమ్మ పాటలు పాడి అలరించారు.

# తెలంగాణ సంస్కృతికి ఆనవాలు బతకమ్మ

**- వైభవంగా పెద్ద శంకరంపేటలో సద్దుల బతుకమ్మ - ఆనంద ఉత్సవాలలో మహిళలు బతకమ్మ ఆటపాటలు**

**వేద న్యూస్, మెదక్ జిల్లా :**



మెదక్ పెద్ద శంకరంపేట్ పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. బతుకమ్మను రకరకాల పువ్వులతో గుణకపువ్వు తంగర పువ్వు బెల్లం పువ్వు బంతిపూలు చామంతి రకరకాల పువ్వులతో అందంగా అలంకరించి గునుక పువ్వుకు రకర కాల రంగులు వేసి బతుకమ్మను గుమ్మడి ఆకులు పరచి అనేక రకాల పూలతో అందంగా అలంకరించారు. పసుపుతో అందంగా గౌరమ్మను తయారుచేసి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. అనంతరం బతకమ్మను తీసుకొచ్చి మహిళలు డీజీ పాటలతో బతుకమ్మ ఆడుతూ పాడుతూ ఆనంద ఉత్సవాలతో గడిపారు. 9 రోజులు ఘనంగా నిర్వహించిన బతకమ్మ పండుగ 9వ రోజు సద్దుల బతుకమ్మ ఆఖరి బతుకమ్మ ప్రత్యేకంగా ఉంటుంది. పెద్ద శంకరంపేటలో గడికోట రామాలయం మందిర్ కొండల రాయుడు గుడి వద్ద టెంపుల్ ప్రియాంక కాలనీ పటేల్ నగర్ కాలనీ దుర్గామాత గూడెపు గల్లి వద్ద బతకమ్మను పెట్టి మహిళలు చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా ఆడుతూ పాడుతూ డీజే పాటలతో బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం పెద్ద శంకరంపేట్ బతుకమ్మ చెరువు తిరుమలాపురం చెరువు లో బతుకమ్మను పోయిరా బతుకమ్మ అంటూ నిమజ్జనం చేశారు. అనంతరం తెచ్చుకున్న సద్దుల బతుకమ్మ ప్రసాదాలను మహిళలు ఆడపడుచులు ఒకరికొకరు నైవేద్యం సమర్పించుకొని వాసు బొట్లు తీసుకొని కొంతసేపు ఆనందంగా గడిపారు.. అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకమైన ఏర్పాటు చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

## - కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్:**




రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా, నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థ ల ఎన్నికల నిర్వహణ పై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన లతో కలసి ఆర్డీఓ లు, ప్రత్యేక అధికారులు,నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని..అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించినారు.జిల్లాలోని చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బంధీగా జరిగేలా చూడాలని అన్నారు.నోడల్ అధికారులు ప్రతి రోజు రిపోర్ట్ లు నిర్ణిత ఫార్మాట్ లో సమర్పిచాలని తెలిపారు.

జిల్లాలో మాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల మేనేజ్మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్ %డ% కంప్లైంట్స్ రెడ్రెస్సల్, తదితర విభాగాల వారీగా సంబంధిత నోడల్ అధికారులు, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేందుకు ప్రతి విభాగానికి నోడల్ అధికారులను నియమించామని, ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా ఎన్నికల నిర్వహణ జరగాలి. శాంతియుత, స్వేచ్ఛాత్మక మరియు పారదర్శక ఎన్నికలకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్పష్టం చేశారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అందరూ పాటించాల్సిన నిబంధనలను గుర్తుచేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించి, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.ఈ సమావేశం లో ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఎన్నికల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలులో పాల్గొన్న విష్ణు వర్ధన్ రెడ్డి

**వేద న్యూస్,కాజిపేట :**



కాజీపేట 47వ డివిజన్ బోడ గుట్టలో మాజీ డివిజన్ అధ్యక్షులు దొంగల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ ఉత్సవంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు యువనాయకులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరిల్ లారెన్స్,జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇప్ప శ్రీకాంత్ కౌటిల్ రెడ్డి, కుమారుస్వామి, కార్తీక్ మహిళలు మరియు కాంగ్రెస్ నాయకులు తిరుపతి, శ్రీనివాస్,బర్ల రాజలుమార్, దార్ల రాజకుమార్,భద్రయ్య, ప్రదీప్ కుమార్, రవి, రాకేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం అక్టోబర్ 01, 2025

# రైతు సంక్షేమమే సీఎం సంకల్పం

**– సన్న బియ్యం పథకం విప్లవత్మకమైన నిర్ణయం – రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**వేద న్యూస్,సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



సంపద పెంచి..పేదలకు పంచడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని తెలంగాణ పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. నిరుపేదలను ఆదుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయమన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సన్న బియ్యం పథకం దేశంలో మరెక్కడా లేదని తెలిపారు. సన్న బియ్యం పథకం విప్లమాత్మకమైన నిర్ణయమన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కుళేశ్వరంగా మార్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు పదేళ్ల కాలంలో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. 20 నెలల కాంగ్రెస్ పరిపాలనలో 70 శాతం పైగా ఎన్నికల హామీలను అమలుపరిచామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే మహా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న,జ్యోతి కరుణాకర్,వల్దాసు దేవేందర్,నిమ్మల వెంకన్న,బైరబోయిన శ్రీనివాసు,యాట ఉపేందర్,సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రంగలీల మైదానంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లా లోని ఉర్సు రంగలీల మైదానం లో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు సాంప్రదాయ వస్త్రాలు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొని తంగేడు,గునుగు,బంతి వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి తీసుకొచ్చారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ చుట్టూ ఆడుతూ పాడుతూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక అని, తల్లి గౌరమ్మవారిని పూజిస్తూ ఆడపడుచులు సమూహంగా కలసి జరుపుకునే పండుగ సామాజిక ఐక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. దసరా ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఉత్సాహానికి ప్రతీక అని అన్నారు. అనంతరం బతుకమ్మలను తీసుకువెళ్లి రంగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

# తెలంగాణలో మళ్లీ రెండురోజులు భారీ వర్షాలు

వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం మధ్య బంగాళాఖాతంలో ఉత్తర కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల మధ్య విస్తరించి ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణ దిశ వైపునకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్‌లో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని.. అక్టోబర్ ఒకటిన బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 2న పశ్చిమ వాయువ్య దిశగా కదిలి పశ్చిమ మధ్య, దానికి ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని.. 3న పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది. తెలంగాణలో మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

బుధవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. శనివారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని వివరించింది.

# కోర్టులో చెల్లదని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారు

బీహార్, మహారాష్ట్రలలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని, కోర్టుకు వెళితే అభ్యంతరం ఏమిటని ప్రశ్నిస్తున్నానని ఈటల అన్నారు. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చు పెట్టవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోందని అన్నారు. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా రిజర్వేషన్ ప్రకటించారని విమర్శించారు. తమ పార్టీ తరఫున శాసనసభలో, మండలిలో పూర్తిగా మద్దతు ఇచ్చామని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీని అనవద్దని సూచించారు.

# పైరసీ ముఠాల వెనుక బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకుల హస్తం

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినిమా పరిశ్రమను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న పైరసీ భూతం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తెలిసి సినీ ప్రముఖులు నివ్వెరపోయారు. తాము ప్రచారం చేస్తున్న బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులే పైరసీ ముఠాలకు నిధులు సమకూరుస్తున్నారనే చేదు నిజం వారిని తీవ్రమైన షాక్‌కు గురి చేసింది. ఈ విషయం తెలియడంతో, భవిష్యత్తులో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన ఎలాంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఏకగ్రీవంగా నిర్ణయించుకుంది. ఇటీవల భారీ పైరసీ ముఠాలను అరెస్ట్ చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు, ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసేందుకు మంగళవారం నగరంలో సినీ పరిశ్రమ పెద్దలతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అగ్ర హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, నాని, నాగచైతన్యతో పాటు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, పలువురు దర్శకులు, డిజిటల్ మీడియా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పోలీసులు ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పైరసీ ముఠాల పనితీరును వివరించారు. సినిమాలు థియేటర్లలోకి రాకముందే హెచ్‌డీ క్వాలిటీ ప్రింట్లు ఎలా బయటకు వస్తున్నాయో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. డిజిటల్ మీడియా సంస్థల సర్వర్లలో ఉన్న బలహీనమైన సైబర్ భద్రతను ఆసరాగా చేసుకుని హ్యాకర్లు సినిమాలను దొంగిలిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ హ్యాకర్లకు, పైరసీ ముఠాలకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు భారీగా డబ్బు చెల్లిస్తున్నారని ఆధారాలతో సహా వివరించారు. ఈ మొత్తం వ్యవహారం తెలుసుకున్న డిజిటల్ మీడియా కంపెనీలు తమ సైబర్ భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంటామని, సర్వర్ల రక్షణ కోసం మరింత ఖర్చు చేస్తామని హామీ ఇచ్చాయి. తెలుగు సినిమా పరిశ్రమను కాపాడటానికి పోలీసులు చేస్తున్న కృషిని హాజరైన సినీ ప్రముఖులందరూ మనస్ఫూర్తిగా అభినందించారు. పైరసీ ముఠా గుట్టురట్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు త్వరలోనే ఓటీటీ పైరసీ కంటెంట్ సైట్ అయిన 'ఐబొమ్మ' నిర్వాహకులను పట్టుకుంటామని చెప్పారు. దాదాపు రూ.2 కోట్లు ఖర్చు చేసి, అధునాతన పరికరాలు వాడి పైరసీ ముఠాను పట్టుకున్నామని, త్వరలో 'ఐబొమ్మ' నిర్వాహకులను కూడా అరెస్ట్ చేస్తామని సీవీ ఆనంద్ వెల్లడించారు.

# సంపాదకీయం

ఉద్యోగాల భర్తీలో ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధి..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొదలైన నాటి నుండి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. అందుకు ఉదాహరణే 60 వేల ఉద్యోగాల నియామక పత్రాల అందజేత. గత ప్రభుత్వ ఏలుబడిలో ఉప ఎన్నికలు వస్తే గానీ ఉద్యోగాలు గుర్తుకు రావు. ఒక వేళ నోటిఫికేషన్ ఇచ్చినా, దాంట్లో ఎన్నో కొర్రీలను సాకుగా చూపించి వ్యవహారం అంతా అప్పటి టీఎస్‌పీఎస్సీ, కోర్టుల మధ్యనే నలిగేటట్లు చేశారు. న్యాయ, సాంకేతిక పరమైన చిక్కులను పట్టించుకోకపోగా జిరాక్స్, జాబ్ కన్సల్టేషన్ సెంటర్లలో ప్రశ్న పత్రాలను అమ్ముకున్న దౌర్భాగ్య పరిస్థితులను చూశాం. విద్యార్థుల జీవితాలను ఆగం చేసి వారిని సామాజికంగా, ఆర్థికంగా కుంగుబాటుకు గురిచేసి ఈరోజు కొంతమంది రాజకీయ నిరుద్యోగులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ విద్యార్థి, నిరుద్యోగుల మీద రాజకీయం చేస్తోంది. దశాబ్దకాల పరిపాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క డీఎస్సీని నిర్వహించకుండా తండా, గూడాలు, మారుమూల పల్లెల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల మూసివేతకు కారణమయ్యారు. దీంతో ఇంగ్లీష్ విద్యతోనే భవిష్యతు ఉందని భావించి పేదవాళ్లు వారి పిల్లలను ప్రైవేటు బడులలో చదివించసాగారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఆర్థిక భారాన్ని వాళ్లు అలవాటు చేసుకోవాల్సి వచ్చింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 11,062 పోస్టుల నోటిఫి కేషన్ జారీ చేసి పరీక్షలను నిర్వహించిన 3 నెలలలోపే నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేసి ప్రభుత్వ పాఠశాలల పునరుత్తేజానికి దోహదపడి చరిత్ర సృష్టించింది. కేజీ టూ పీజీ నాణ్యమైన ఉచిత విద్య అని మోసం చేసిన వారికి ఈ విషయం జీర్ణం కాకపోవచ్చు. కానీ పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందనేది వాస్తవం. ఎల్బీ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాఫ్ నర్స్, జేఎల్, డీఎల్, పోలీస్, టీచర్స్, ఏఈఈ, గ్రూప్–4, ఏఈ, ఏఈఓ(అగ్రికల్చర్), రెవిన్యూ(జీపీఓ)... ఇలా 60 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందించి తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగుల్లో ఒక బలమైన విశ్వాసాన్ని నెలకొల్పారు. ఈ అన్ని ఉద్యోగాలు ఏదో ఒక కారణంగా కోర్టుల చుట్టూ తిరిగుతుంటే టీజీపీఎస్సీకి దిశానిర్దేశం చేయించి న్యాయపరమైన చిక్కులు వాటిపైన లేకుండా సీఎం చొరవ తీసుకున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనేవి తెలంగాణకు ఒక పెద్ద భావోద్వేగ అంశం. కానీ దాన్ని కేవలం వారి కుటుంబానికి సంబంధించిన అంశంగా మార్చుకున్న గత పాలకులు ఈ రోజు వారి మధ్య జరగాల్సిన నియామకాల కోసం కుటుంబంలో వారికి వారే కొట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థులకు ఇచ్చి ప్రజా పాలనలో వారిని భాగస్వాములను చేద్దామని ప్రయత్నిస్తుంటే పదేళ్లు నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ఒకవైపు, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల పేరిట పంగనామాలు పెట్టిన బీజేపీ మరోవైపు.. సోషల్ మీడియా ద్వారా కొంతమంది రాజకీయ నిరుద్యోగులను ఉసిగొల్పి, వారికి అన్ని రకాల సహాయ సౌకర్యాలను అందిస్తూ నిజమైన అభ్యర్థులను భీతిల్లేలా చేస్తున్నాయి. అందులో భాగంగా గ్రూప్–1 ఉద్యోగాలు 3 కోట్లకు అమ్ముకున్నారని గత ఏలుబడిలో పేపర్లు అమ్ముకున్న కీలక మాజీ మంత్రి విమర్శించారు. 563 పోస్టులకు గాను లెక్కగట్టి 17 వందల కోట్ల లావాదేవీలు జరిగాయని గుడ్డిగా విమర్శించారు. ఇదే విషయాన్ని గ్రూప్–1 ర్యాంకర్ల తల్లిదండ్రులు ప్రెస్ క్లబ్ వేదిక నుంచి, ఆధారాలు ఉంటే చూపియండని గట్టిగా అడిగే సరికి మాజీ ఐటీ మంత్రి తోకముడుచుకున్నారు.

నిరుద్యోగుల భుజాలపై తుపాకీ పెట్టి ప్రజా ప్రభుత్వాన్ని కాల్చాలనుకునే వారి కుటిల నీతిని తెలంగాణ ప్రజలు గమనిస్తూ ఉన్నారు. గ్రూప్–1 ఉద్యోగాల విషయంలో హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జిమెంటును డివిజన్ బెంచ్ జడ్జిలు సస్పెండ్ చేసిన తరుణంలో కోర్టు చాలా స్పష్టంగా చెప్పిన విషయం ఏమిటంటే ఆధారాలను ప్రధాన అంశంగా చూడకుండా కేవలం పిటిషనర్ చెప్పిన నోటి వ్యాఖ్యలనే అంశాలుగా పరిగణలోకి తీసుకొని జడ్జిమెంట్ ఇవ్వడం కరెక్ట్ కాదని, ఈ జడ్జిమెంట్‌లో శాస్త్రీయత లోపించిందని కోర్ట్ తేల్చి చెప్పేసింది. అక్రమాలు జరిగాయని అభ్యర్థులు ఎలా చెబుతున్నారు? వాటికి ఆధారం ఏమిటి? పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయా? మాస్ కాపింగ్, లికేజ్ జరిగిందా? పక్షపాతంతో వ్యవహరించారా? తదితర అంశాలపై ఆధారాలతో స్పష్టత ఇవ్వాలని హైకోర్టు ఘాటుగా ప్రశ్నించింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసిన తరువాత బోర్డులో ఎటువంటి తప్పిదాలు జరిగినా ఉపేక్షించమని అధికారులను దిశానిర్దేశం చేసి, ఒక నిజాయితీ గల ఐఏఎస్ ఆఫీసర్ అయిన బుర్రా వెంకటేశంని చైర్మన్‌గా నియమించారు. గ్రూప్–1,2,3 నియామకాలు త్వరితగతిన జరిగిపోతే కొత్త నోటిఫికేషన్‌ని జాబ్ క్యాలెండర్ ద్వారా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న సందర్భంలో ప్రతిపక్షాలు ఈ విషయాన్ని ఓర్వలేక లక్షలు ఫండింగ్ చేసి ఒక వర్గ నిరుద్యోగులను రెచ్చగొట్టి నిజమైన అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేయడం తెలంగాణ సమాజాన్ని మోసం చేయడమే.. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థి లోకం కూడా ఈ రాజకీయ నిరుద్యోగుల వలలో చిక్కు కోకుండా జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలతో అర్హతను పొంది ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073